క్లుప్తంగా

నేటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

ఐరాల: ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంగళవారం నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు ఓఎంఆర్ విధానంలో ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు ఎమ్మార్సీకి చేరుకున్నాయని తెలిపారు.

జగనన్న ఇళ్ల పనుల పరిశీలన

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట పంచాయతీలోని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీవో గౌరి పరిశీలించారు. మండలంలో 1875 ఇళ్లు మంజూరైతే ఇప్పటి వరకు 679 పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి లబ్ధిదారూ పనులను వేగవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, కుమార్ పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో నిర్మలాదేవి

ఐరాల: ఇళ్ల నిర్మాణ పనులు ఉగాది లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో నిర్మలాదేవి ఆదేశించారు. ఆమె సోమవారం నయనంపల్లె జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి ఉగాది నాటికి ఇళ్లలో చేరాలని లబ్ధిదారులను కోరారు. వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా లబ్ధిదారులకు రూ.35 వేల నుంచి 50 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు బేస్‌మెంట్ వేసుకుంటే వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టకపోతే స్థలాలను వెనక్కు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏపీఓ సంధ్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈవో మునిరాజులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

ఐరాల: ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని ఏపీఓ సంధ్య ఆదేశించారు. ఆమె సోమవారం రంగమ్మచెరువులో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కూలీలు గరిష్టంగా వేతనం పొందేందుకు సమయపాలన పాటిస్తూ రెండు పూటలా పనిచేయాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. చెర్లోపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 123 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తిరునాళ్ల



పూజలు చేస్తున్న గ్రామస్తులు

సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తిరునాళ్ల సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం హోమం, సాయంత్రం పార్వేటి ఉత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

వడమాలపేట: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో 9 గంటలకు హాజరై నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, వాహనాలను ముందుగా చూసుకునే వెసులుబాటు ఉందన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు డిపాజిట్ పోగా, మిగతా నగదును ప్రభుత్వం నిర్దేశించిన జీఎస్టీ రూపంలో చెల్లించాలని సూచించారు.

సంక్షేమ సారథి సీఎం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం గట్రాళ్లమిట్ట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పథకాల ఫలాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ, నాయకుల సిఫార్సులు ఉండేవారికి పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు నిర్మించాలని, సీసీరోడ్లు వేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు గుణవతి, రజనీకాంత్, జయకోడి, ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, కలై అరసి, సుబ్రమణి, శ్రీరాములురెడ్డి, వెంకటేష్‌రెడ్డి, సాయి, సిలంబరసన్, హరి, రవీంద్రారెడ్డి, ప్రవీణ్, విక్టర్, కృష్ణ, రఘు, రెడ్డెప్ప, రాకేష్, చిట్టి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్టు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. ఆయన సోమవారం బోధగుట్టపల్లె పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తోందన్నారు. చేసిన మంచిని గుర్తించి ఈ సారి కూడా జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. అర్హత ఉన్నా కొందరికి పింఛను మంజూరుకాలేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీడీవో శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, నాయకులు మనోహర్ రెడ్డి, గోందివాళ్ల వూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలకు శ్మశాన వాటికలు



వసంతాపురం దళితవాడలో శుభ్రం చేసిన శ్మశాన వాటిక

గుడిపాల: మండలంలోని దళితవాడలకు శ్మశాన వాటికల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. సోమవారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ కాలనీలకు సంబంధించి శ్మశాన వాటికలను గుర్తించి వాటికి హద్దురాళ్లను నాటించాలన్నారు. భూ ఆక్రమణకు గురైన వాటిని కూడా వెంటనే గుర్తించాలన్నారు. అనంతరం వసంతాపురం పంచాయతీలోని తుమ్మలవారిపల్లె, వసంతాపురం దళితవాడలకు సంబంధించి శ్మశాన వాటికలను చదును చేసి, సర్వే హద్దురాళ్లను తహసీల్దార్ నాటించారు. గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమాభాయ్, వీఆర్‌ఓ సురేష్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం 'భ్రూణహత్యలు వద్దు-లింగవివక్ష నిర్మూలన'పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని సూచించారు. అలా చేస్తే ప్రభుత్వం రూ.10 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తుందన్నారు. ఆడబిడ్డను బతకనిద్దాం-ఎదగనిద్దాం, నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అవుతుందన్నారు. అనంతరం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం దేవి, సంఘమిత్ర వనిత, అంగన్‌వాడీ కార్యకర్త జమున పాల్గొన్నారు.

రూ.20లక్షలతో మొరపకుంట అభివృద్ధి



మొరపకుంట పరిశీలనలో ఏపీడీ వరప్రసాద్

చౌడేపల్లె : మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీలో ఉన్న మొరపకుంటను రూ.20లక్షల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు డ్వామా ఏపీడీ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మొరపకుంటను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుంట కట్ట బలోపేతం, నీటి నిల్వకు అవసరమైన పనులను ఉపాధి పథకం కింద చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రతి కుటుంబానికి కనీసం వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఏపీఓ శ్రీనివాస్ యాదవ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూరాధ, కోటేశ్వరరావు, బాబురెడ్డి, జేఈ ధనుంజయుడు, టీఏ అమరనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన మదనపల్లె బీటీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు పోస్టర్ విడుదల చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎంపీ మిథున్‌రెడ్డి ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 60 కంపెనీలు మేళాకు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, రమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

వి.కోట : మండలంలోని తోటకనుమ గ్రామంలో చిరుధాన్యాల సాగు, ఉత్పత్తులు, పోషక విలువలపై మహిళా రైతులు, విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. రైతులు సైతం చిరుధాన్యాల సాగుకు ముందుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, వ్యవసాయ సహాయకుడు కార్తీక్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నేతల సమావేశం

పూతలపట్టు(యాదమరి): చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, నాయకులు హాజరుకావాలని నాయకులు కోరారు.

వెలుగు సీసీపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి క్లస్టర్ సీసీపై సోమవారం ఎస్‌హెచ్‌జీ సభ్యులు తహసీల్దార్ బెన్నురాజ్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గుండ్లకట్టమంచి క్లస్టర్ పరిధిలో 32 సంఘాలు ఉన్నాయన్నారు. గ్రూపులోన్లు మంజూరు చేయకుండా సీసీ హైమావతి ఆరు నెలలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రూపు సభ్యులను దుర్భాషలాడడంతోపాటు కులం పేరుతో దూషిస్తోందన్నారు. తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ సీసీపై విచారణ చేయాలని వెలుగు ఏపీఎంను ఆదేశించారు.

అడవుల సంరక్షణ మన బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

శ్రీరంగరాజపురం: అడవులకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అటవీశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఎస్సార్‌పురం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ అడవుల సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. అటవీశాఖ నిబంధనలను ఉల్లంఘించి అడవులకు నిప్పు పెట్టడం, చెట్లు నరకడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం పర్యావరణం కాపాడుకోవడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు అటవీశాఖ వలంటీర్ల బ్యాడ్జీలను అందించారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించా రు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆన్‌లైన్‌లో 'స్పందన' వినతుల నమోదు





ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్, పూతలపట్టు: రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్



చిత్తూరు రూరల్ : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి



తహసీల్దార్ సుశీలమ్మతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించాలని నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కైలాసపురం శ్మశానవాటికలో గ్యాస్ క్రిమిటోరియం పనులు వేగవంతం చేయించాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ వినతిపత్రం ఇచ్చింది. కార్యక్రమంలో మొత్తం 7 వినతులు అందాయి. వీటిలో ఇంజనీరింగ్: 4, టీపీవో: 2, రెవెన్యూ: 1 చొప్పున ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి సంబంధిత విభాగాలకు బదలాయించారు. ఏ వారం అందిన వినతులు ఆ వారాంతానికి పరిష్కరించి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

హౌసింగ్ లక్ష్యాలు చేరుకోవాలి

నగరపాలక పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి నిర్దేశించిన వారాంతపు లక్ష్యాలను చేరుకునేలా సూపర్‌వైజర్లు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం హౌసింగ్ సూపర్‌వైజర్లతో ఆమె సమీక్షించారు. వందశాతం లక్ష్యాలు పూర్తిచేసేలా ప్రణాళికబద్ధంగా పని చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, హౌసింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: 'స్పందన' ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. దారి తగదాలు, భూ సమస్యలు, సర్వే, రీ-సర్వేలో తప్పులతడకగా ఉన్నాయని, ఇంటి స్థలం కావాలని..ఇలా మొత్తం 21అర్జీలు వచ్చాయి. వీటిపై ఆమె పైవిధంగా సిబ్బందిని ఆదేశించారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: తహసీల్దార్ విజయభాస్కర్ సోమవారం తన కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కువగా రేషన్ కార్డు, పాసుపుస్తకంలో పేర్ల మార్పు, భూ సమస్యలపై వినతులు అందాయని ఆయన చెప్పారు. అనంతరం పాటూరు సచివాలయాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి

తవణంపల్లె: మండలంలో రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. వారు సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ సుశీలమ్మకు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు హరికృష్ణారెడ్డి, సురేష్‌బాబురెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, ఎంపీటీసీ డేవిడ్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో భూ సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సకాలంలో విద్యుత్ సర్వీసులు



ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న కాలనీలో సకాలంలో విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. స్థానిక అర్బన్ ఈఈ కార్యాలయంలో అర్బన్, రూరల్ డివిజన్ అధికారులతో ఆయన సమీక్షించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు వెంటనే ఉచితంగా సర్వీసులు ఇవ్వాలన్నారు. విద్యుతు చౌర్యానికి చెక్ పెట్టి, అదనపు లోడును క్రమబద్ధీకరించాలన్నారు. వేసవి కాలంలో సమీపిస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను నియంత్రించాలన్నారు. ప్రతినెలా వంద శాతం విద్యుత్ బిల్లుల వసూళ్లకు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను ఏఈలు క్లోజ్ చేయాలన్నారు. ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ ఏఈలు పాల్గొన్నారు.

రీసర్వేలో పొరబాట్లపై ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు

పలమనేరు : మండలంలోని మారేడుపల్లె రైతులు తమ గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో జరిగిన పొరబాట్లపై సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందనలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సర్వే బృందం నిర్లక్ష్యం కారణంగా సర్వే నంబర్లు మారిపోయాయని, వాస్తవ విస్తీర్ణం తగ్గిందని, అనుభవంలో లేనివారి పేర్లు వచ్చాయని పేర్కొన్నారు. దీనిపై గతంలో గంగవరం తహసీల్దార్‌కు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో గురుమూర్తి, వెంకటప్ప, మొగిలప్ప, హేమంత్, లక్ష్మయ్య ఉన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమరనాథ్

గంగవరం: మండలంలోని రొంటకుంట్లలో ఆదివారం రాత్రి ఓ పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. చిన్నపాపమ్మ అనే మహిళ ఒంటరిగా గుడిసెలో నివసిస్తోంది. రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించేందుకు మరొకరి ఇంటికి వెళ్లింది. కాసేపటి తర్వాత ఆమె గుడిసెకు నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు మంటలు అదుపు చేసేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంట్లోని సామగ్రి, నగదు, బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే గుడిసెకు నిప్పు పెట్టినట్లు ఆరోపించింది. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ అమరనాథ్ సోమవారం ఉదయం గ్రామానికి వెళ్లి దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నూతన సాంకేతికత వైపు మొగ్గు చూపాలి

- సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

నగరి: రైతులు నూతన సాంకేతికత వైపు మొగ్గు చూపాలని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని వేలావడి గ్రామంలో డ్రోన్లు ఉపయోగించి పంటలకు పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ వారు వ్యవసాయ డ్రోన్ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేయడం జరిగిందని, ఈ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతుల పొలాల్లో డ్రోన్ వినియోగించి ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రోన్ వినియోగించి పిచికారీ చేయడంలో 6 నుంచి 8 నిమిషాల వ్యవధిలో కేవలం 10 లీటర్ల నీటిని వినియోగించి మందు మోతాదులో 70 నుంచి 80 శాతం వాడి పిచికారీ చేయవచ్చన్నారు. అలా చేయటం వల్లనీరు, పురుగుమందు, కూలీల ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. మామూలుగా కంటే కూడా ఈ పద్ధతిలో పురుగుమందు ప్రభావం బాగా పని చేస్తుందని, ఈ నూతన సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం వారు గ్రామంలో 10 ఎకరాల పొద్దుతిరుగుడు పంటలకు డ్రోన్ వినియోగించి పురుగుమందు పిచికారీపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు దివ్య, రామ్ కుమార్, మండల వ్యవసాయాధికారులు రాఘవేంద్ర యాదవ్, యామిని, వ్యవసాయ సహాయకులు ప్రేమ్ కుమార్, శోభ, రైతులు పాల్గొన్నారు.